సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 25-11-2024

సంపుటి: 20 సంచిక: 205

పేజీలు: 4 వెల: రూ.1



## సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- పార్టీ శ్రేణులకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచన
- ప్రజల నుంచి వినతుల స్వీకరణ

(సత్యంన్యూస్, టెక్కలి)

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని నాయకులకు, అధికారులు సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు వినతులు అందజేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వినతుల స్వీకరణలో మంత్రితో పాటు మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# కార్పొరేషన్‌తో కాపురం.. పంచాయతీతో పిల్లలు

"అధ్యక్షా.. నా నియోజకవర్గంలో జిల్లా కేంద్రంలో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిగి 14 ఏళ్లు అయింది. పాలకవర్గం లేకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిపోయింది. దయచేసి ఎన్నికలు నిర్వహించేటట్టు చూడండి.."

– ఇది స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన అంశం.



"ఎమ్మెల్యే గారూ.. నమస్కారం. శ్రీకాకుళం నగర కార్పొరేషన్‌లో మా ప్రమేయం లేకుండా కలిపేసిన కుశాలపురం పంచాయతీని దయచేసి తప్పించండి. దీని వల్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు మంజూరు కావడంలేదు. కుశాలపురంలో 1100 జాబ్‌కార్డులు, తోటపాలెంలో 950 జాబ్‌కార్డులు ఉన్న వేతనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగని మున్సిపల్ కార్పొరేషన్ నిధులు మంజూరుచేసి అభివృద్ధి చేస్తుందా? అంటే అదీ లేదు. మున్సిపల్ మినిస్టర్‌తో మాట్లాడతారో, పంచాయతీరాజ్ శాఖ మంత్రితో మాట్లాడుతారో మాకు తెలీదు గానీ దయచేసి కార్పొరేషన్ పరిధి నుంచి మా పంచాయతీని తప్పించేటట్టు చూడండి.."

– ఇదీ కుశాలపురం గ్రామపెద్దలు ఆదివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును కలిసి వినతిపత్రం ఇవ్వడంతో పాటు అక్కడికక్కడే మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణతో మాట్లాడించిన సందర్భం.



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పై రెండూ రెండు సందర్భాలైనప్పటికీ ఒకే సమస్యకు ముడిపడి ఉన్న రెండు కొనలు. 2024 ఎన్నికల్లో శ్రీకాకుళం వైకాపా అభ్యర్థి పెద్ద తేడాతో ఓడిపోడానికి ప్రధానమైన కారణం ఇక్కడ ఎన్నికలు నిర్వహించకపోవడం ఒకటి. సరిగ్గా దీనినే ప్రచారాస్త్రంగా మలచుకొని టీడీపీ అభ్యర్థి తాము అధికారంలోకి వస్తే కార్పొరేషన్‌కు ఎన్నికలు జరుపుతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా కార్పొరేషన్ ఎన్నికలపైన ఇతిమిద్ధంగా ఒక ప్రకటన ఈరోజుకూ వెలువడలేదు. మేయర్ రేసులో ఉన్నామని ప్రకటించుకుంటున్న అభ్యర్థులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో గతంలో నిర్వహించిన రోస్టర్ విధానం, రిజర్వేషన్ పద్ధతి, వార్డుల విభజన వంటి అంశాల మీద చర్చించి, సమావేశాలు పెట్టించి ఆశలు రేకెత్తిస్తున్నారే తప్ప ప్రభుత్వ స్థాయిలో ఎన్నికల కోసం తీసుకోవాల్సిన చర్యలపై మాత్రం జిల్లా నుంచి ఎవరూ ముందడుగు వేయడంలేదు. అందుకే కుశాలపురం గ్రామస్తులు తమ పంచాయతీని కార్పొరేషన్ చెర నుంచి తప్పించాలని ఎమ్మెల్యేను కలిశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే ఎన్నికల కోసం విజయవాడ స్థాయిలో అందరికీ చెప్పేశానని, ఇక సిద్ధమైపోండంటూ పాత ఇన్‌ఛార్జిలనే కొనసాగిస్తూ అదిగో ఎన్నికలు, ఇదిగో ఎన్నికలని చెబుతున్నారు. వాస్తవానికి విలీన పంచాయతీలను వదిలేసి ఎన్నికలు జరిపించాలంటే ప్రభుత్వం తప్పనిసరిగా చట్టాన్ని తీసుకురావాల్సి ఉంది. అలా కాకుండా ఏడు విలీన పంచాయతీలతో కలిపి కార్పొరేషన్‌కు ఎన్నికలు జరపాలంటే ఒక్క క్షణంలో జరిపించొచ్చు. ఏ నిర్ణయమైనా ఇప్పుడు ప్రభుత్వం చేతిలోనే ఉంది. శ్రీకాకుళం మున్సిపాలిటీలో కిల్లిపాలెం, చాపురం, ఖాజీపేట, పాత్రునివలస, పెద్దపాడు, తోటపాలెం, కుశాలపురం పంచాయతీలను కలుపుతూ కార్పొరేషన్ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికలు లేవు. ఎందుకంటే తమను కార్పొరేషన్‌లో చేరిస్తే పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుందని ఏడు పంచాయతీలు కలిపి హైకోర్టులో కేసు వేశారు. దీంతో ప్రభుత్వం విలీనం మీద తీసుకువచ్చిన జీవోపై కోర్టు స్టే ఇచ్చింది. ఈ కేసు నడుస్తుండగానే ప్రభుత్వం 2021లో ఆర్డినెన్స్ తీసుకువచ్చి అప్పటి గవర్నర్ ఆమోదముద్రను వేయించుకుంది. ఇది కూడా సరికాదంటూ మళ్లీ ఏడు పంచాయతీలు కోర్టును ఆశ్రయించాయి. ఆర్డినెన్స్‌ను ఆరు నెలల్లోగా అసెంబ్లీలో చట్టం చేయాల్సిన నిబంధన ఉంది కాబట్టి అదేదో తేలిన తర్వాత కోర్టు తలుపు తట్టండంటూ ఓ డైరెక్షన్ వచ్చింది. ఈలోగా కరోనా సమయంలో ఒక్క రోజు పాటు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీని సమావేశపర్చి అనేక బిల్లులతో పాటు ఈ ఆర్డినెన్స్‌ను కూడా చట్టంగా చేసేసింది. దీంతో చట్టం మీద సవాల్ చేస్తూ మళ్లీ ఏడు పంచాయతీలు హైకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం 17924/2021 పేరుతో వేసిన రిట్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్ ఉంది. సాధారణంగా చట్టం మీద తీర్పునివ్వడంపై ఢిల్లీ నుంచి గల్లీదాకా అనేక వాజ్యాలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఒకసారి చట్టం చేసిన తర్వాత అందులో కోర్టు వేలు పెట్టకూడదని, ప్రజాప్రతినిధులు దేన్నయినా సమీక్షించే అధికారం తమకుందని కోర్టులు చెబుతున్న గొడవ ఇప్పటికీ రాజ్యాంగబద్ధంగా ఒక కొలిక్కి రాలేదు. ఇప్పుడు ఈ విలీన పంచాయతీల చట్టాన్ని రద్దు చేస్తూ మళ్లీ అసెంబ్లీలో చట్టం చేస్తేగానీ కార్పొరేషన్ నుంచి ఈ ఏడు పంచాయతీలు బయటపడవు. అలా అని ఏడు పంచాయతీలతో ఎన్నికలకు వెళ్దామంటే ఇక్కడ తాజా, మాజీ సర్పంచ్‌లెవరూ అందుకు అంగీకరించడంలేదు. ఈ విలీన పంచాయతీల్లో పంచాయతీ పనులకు ఎంపీడీవో కార్యాలయానికి, అభివృద్ధి పనులకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సిన అగత్యం ఏర్పడింది. కార్పొరేషన్‌లో విలీనం చేసినా ఇక్కడ పెద్దగా అభివృద్ధి పనులు జరగడంలేదు. గతంలో పంచాయతీలో పని చేసిన శానిటేషన్ సిబ్బందినే మున్సిపల్ వర్కర్లుగా గుర్తించి చెత్తను ఊడ్పిస్తున్నారు తప్ప కాలువలు, రోడ్లు వేయడంలేదు. ఎందుకంటే.. మున్సిపాలిటీకి వచ్చిన జనరల్ ఫండ్ నిధులతో పాత 36 వార్డుల్లో రోడ్లు, కాలువలు వేయడానికే సొమ్ములు సరిపోవడంలేదు. చాపురం, ఖాజీపేట పంచాయతీల్లో అంతకు ముందే కొంతమేరకు అభివృద్ధి జరగడం వల్ల విలీనం మంచిదే అనిపిస్తుంది కానీ, ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్న రెండు పంచాయతీలు, శ్రీకాకుళం రూరల్‌లో ఉన్న పాత్రునివలస, కిల్లిపాలెం పంచాయతీల్లో ఏమాత్రం అభివృద్ధి కనిపించడంలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మున్సిపాలిటీలో కలిసే ప్రసక్తి లేదని ఈ ఏడు పంచాయతీల్లోని ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేలకు తెగేసి చెబుతున్నారు. దీనికి పెద్దపాడు మినహాయింపు కావచ్చు. కానీ ఎన్నికలంటూ జరిపితే ఏడింటినీ కలిపైనా చేయాలి, లేదంటే ఏడింటినీ విడగొట్టయినా జరపాలి. ఇందులో మొదటిది స్థానికులకు ఇష్టంలేదు. రెండోది చేయడానికి ఎమ్మెల్యేలకు స్థాయి సరిపోవడం లేదు. అటువంటప్పుడు ఎన్నికలు ఇదిగో వస్తున్నాయి, అదిగో వస్తున్నాయనడం సబబు కాదు.

- ఎన్నికలు లేక కునారిల్లుతున్న అభివృద్ధి
- చట్టం తెస్తేగానీ ఎలక్షన్స్ జరగవ్
- కుశాలపురంను తప్పించాలని ఎమ్మెల్యేకి వినతి
- 2021లో ఆర్డినెన్స్‌ను చట్టంగా మార్చిన ప్రభుత్వం




కాలువలు లేని, రోడ్లు పాడైన చాపురం పచాయతీ వీధులు




# నిజం చెప్పు నువ్వే గెలిపించావా?

- బీహార్ ఉపఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన ప్రశాంత్‌కిశోర్ పార్టీ
- మూడుచోట్ల డిపాజిట్లు రాలేదు
- ఐప్యాక్‌ను నమ్ముకొని నష్టపోయిన జగన్
- పార్టీని ఐప్యాక్ చేతిలో పెట్టిన ఫలితమే 11 సీట్లు









**శాస్త్రాలు చెప్పే బల్లి కుడితిలో పడి చచ్చినట్టు అనేక రాష్ట్రాల్లో పార్టీలను అధికారంలోకి తెచ్చారని మన నేతలు చెప్పకునే ప్రశాంత్ కిశోర్ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా అవతారం ఎత్తాక జరిగిన బీహార్ ఎన్నికలు ఆయనకు చుక్కలు చూపించాయి. రాజకీయాల్లో సలహాలు ఇచ్చి రూ.100 కోట్లు ఫీజు తీసుకునే ప్రశాంత్ కిషోర్‌కి సొంత రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో 4 స్థానాలలో అభ్యర్థులను నిలబెట్టారు. ఒక స్థానంలో డిపాజిట్ వచ్చింది, మూడు స్థానాలలో డిపాజిట్ కోల్పోయారు. దేశం అంతా సర్వేలు చేసే ప్రశాంత్ కిషోర్ తన పార్టీ పోటీ చేసిన 4 స్థానాలలో సర్వే చేయలేదా? 4 స్థానాలలో పోటీ చేస్తే అధికార పార్టీకి పోటీ ఇవ్వలేనప్పుడు ప్రశాంత్ కిశోర్ ఇచ్చిన సలహాలతో ముఖ్యమంత్రులు అయ్యారా? మరి 3 స్థానాలలో ఆయన డిపాజిట్ ఎందుకు కోల్పోయారు? బెలగంజ్ నుంచి పోటీ చేసిన మొహమ్మద్ అమ్జాద్ 17,285 ఓట్లు మాత్రమే వచ్చి మూడోస్థానంలో నిలిచారు. డిపాజిట్ కూడా కోల్పోయారు. ఇమామ్ గంజ్ నియోజకవర్గంలో పీకే అభ్యర్థిగా పోటీ చేసిన జితేంద్ర పాశ్వాన్‌కు 37,103 ఓట్లతో మూడోస్థానం దక్కింది. రామ్‌ఘర్ నియోజక వర్గంలో సుశీల్ కుమార్ సింగ్‌కు 6,513 ఓట్లు మాత్రమే వచ్చాయి. డిపాజిట్ దక్కలేదు. తిరారి నియోజకవర్గంలో సురాజ్ తరఫున కిరణ్ సింగ్ పోటీచేస్తే 5,592 ఓట్లు తెచ్చుకుని డిపాజిట్ కోల్పోయారు. ఇవన్నీ చూస్తుంటే ప్రశాంత్ కిషోర్ ఇచ్చిన సలహాలతో ప్రధానిగా మోడీ అయ్యారా? మమతాబెనర్జీ ముఖ్యమంత్రి అయ్యారా? 230 సీట్లు వచ్చాయా? జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారా? 151 సీట్లు వచ్చాయా? ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యారా? 134 సీట్లు వచ్చాయా? ప్రధానిగా మోడీని ముఖ్యమంత్రులుగా చేసిన ప్రశాంత్‌కిషోర్ తన పార్టీ అభ్యర్థులను ఎందుకు గెలిపించుకోలేకపోయారు?**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జగన్‌మోహన్ రెడ్డి లాంటి వ్యక్తి మరో అడుగు ముందుకేసి అధికారంలో ఉన్న ఐదేళ్లు పార్టీని నడిపే పనిని కూడా ఆయన చేతిలోనే పెట్టి పూర్తిగా ప్రతిష్ఠ కోల్పోయారు. కేసీఆర్ పార్టీ వ్యవస్థలోకి ప్రవేశించాలని చూసిన ప్రశాంత్ కిషోర్‌ను నిర్దాక్షిణ్యంగా కాంట్రాక్టు రద్దు చేసి బయటికి పంపించారు. జగన్‌మోహన్ రెడ్డి తాను పట్టుకున్న కుందేలుకు మూడేకాళ్లు అంటారు కాబట్టి తనకు నచ్చితే నెత్తిన పెట్టుకుంటారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఎమ్మెల్యేలు కలవలేకపోయారు. ఎన్నికల్లో ఓడిపోయాక సామాన్య కార్యకర్తలు కలవలేని పరిస్థితి ఉంది. కార్యకర్తలు అనే పదం జనరల్‌గా ఆయనకు నచ్చదు. ఐ ప్యాక్ టీమ్ అంటే ఆయనకు ఇష్టం. ఐ ప్యాక్ టీమ్ గత ఐదేళ్లు రాజకీయాలు చేసింది. ఐ ప్యాక్ టీమ్ చేసే పనులకు పెద్ద నాలెడ్జి అవసరం లేదు. పక్క పార్టీలో ఉన్న నాయకుని దగ్గరకు వెళ్లి వైకాపాలో చేరండి టికెట్ ఇప్పిస్తాం అని లాబీయింగ్ చేసి వాడి దగ్గర డబ్బులు నొక్కి, జగన్‌మోహన్‌రెడ్డి దగ్గరకు వచ్చి ఫలానావాడు గెలుస్తారని ఫేక్ రిపోర్ట్ ఇచ్చారని, ఆ మేరకే జగన్మోహన్‌రెడ్డి నష్టపోయారన్న ప్రచారం కూడా లేకపోలేదు. ఫేక్ రిపోర్టు ఇవ్వడానికి ఐఐటీలు, ఎన్‌ఐటీలు, మాస్టర్ డిగ్రీలు, పీజీలు అవసరం లేదు. చివరకు ఎన్నికలకు ముందు సభల నిర్వహణ బాధ్యతను కూడా జగన్మోహన్‌రెడ్డి ఐప్యాక్ టీమ్‌కే అప్పగించారు. గడిచిన ఐదేళ్లలో భారీ ఎత్తున సొమ్ములు సంపాదించుకున్న టీమ్ సభ్యులు ఇప్పుడు పత్తా లేకుండాపోయారు. వైకాపాలో బాస్ అయిన జగన్‌మోహన్‌రెడ్డికి, కిందిస్థాయి కార్యకర్తలకు ఎలాంటి సంబంధం ఉండదు. జగన్‌మోహన్‌రెడ్డి డిక్షనరీలో భయం అనే మాట లేదు. అలాగే కార్యకర్తలు అనే మాటా లేదు.. జగన్‌మోహన్‌రెడ్డి తన 2019–2024 పాలనలో కానీ.. ఎన్నికల ప్రసంగాల్లో ఎక్కడైనా నా కార్యకర్తలు అనే మాట జగన్ మోహన్ రెడ్డి వినిపించలేదు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, వైకాపా అధినేత జగన్ ఇద్దరు నేతలు సొంత పార్టీ నాయకులను లెక్కచేయరా?.. అంటే అవుననే ఎక్కువమంది అంటారు. నాలుగు సిద్ధం సభలతో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రచారం ముగించిన జగన్‌కు వచ్చిన సీట్లు 11/175. ఏడు బహిరంగ సభలతో మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం ముగించిన రాహుల్ గాంధీకి వచ్చిన సీట్లు 16/101. జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు నిద్రపోయారు. రాహుల్ గాంధీ గత పదేళ్లు నిద్రపోయి 2021లో యాక్టివ్ అయి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర నిర్వహించి 2024 లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయ్యారు. గత ఐదేళ్లు నిద్రపోయిన జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఎన్నిక అయ్యేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఈ రెండు భిన్న ధృవాలు, రెండు భిన్న మనస్తత్వాలు. ఇద్దరికీ ఒక కామన్ లక్షణం ఉంది.. సొంత పార్టీ నేతలకు లెక్క చేయకపోవడం. పార్టీ నుంచి ఎవరు వెళ్లినా బుజ్జగించరు. పార్టీ మారుతారని సమాచారం ఉంటే మొహం చూడటానికి కూడా ఇష్టపడరు. నేను సీటు ఇచ్చినవాడు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యుడు అని జగన్ అనుకుంటారు. బహుశా రాహుల్‌ది కూడా ఇదే ఫీలింగ్ అనే భావన ఉంది. అసలే అది కాంగ్రెస్. బీహార్ ఉపఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ప్రశాంత్ కిశోర్ ఆ నెపాన్ని పూర్తిగా రాష్ట్రం మీదకు, ప్రజల మీదకు నెట్టేశారు. బీహార్ ఒక విఫల రాష్ట్రమని ప్రకటించేశారు. కానీ రెగ్యులర్ పాలిటిక్స్ చేసే జగన్మోహన్‌రెడ్డికి ఆ సదుపాయం లేదు. అంతో ఇంతో ఈవీఎంల మీద అనుమానం ఉండటం వల్ల కొద్ది రోజులు జగన్మోహన్‌రెడ్డి నెట్టుకొచ్చారు. కానీ మహారాష్ట్ర ఎన్నికలు చూసిన తర్వాత జగన్మోహన్‌రెడ్డి మారాల్సిన అవసరం కచ్చితంగా కనిపిస్తుంది.

మహారాష్ట్రలో శివసేనను చీల్చి ఏకనాథ్ షిండే లాంటి ఒక చరిష్మా లేని నాయకుడ్ని ముఖ్యమంత్రిని చేసినా, ఆయన సారథ్యంలో మరోసారి అక్కడ ఎన్డీయే కూటమి విజయం సాధించిందంటే.. అందుకు ఒకే ఒక కారణం ముఖ్యమంత్రి అయినా కూడా ఏకనాథ్ షిండే నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. కార్యకర్తల తర్వాతే పార్టీ, ప్రభుత్వమన్న రీతిలో వ్యవహరించారు.

### రాజకీయ పార్టీనా? లిమిటెడ్ కంపెనీనా?

జగన్‌మోహన్ రెడ్డికి మంత్రులను, నాయకులను, కార్యకర్తలను కలవడం ఇష్టం ఉండదు. ఆయన సర్వం నేనే, నన్ను చూసి గెలిపించారనుకొనే భ్రమలో ఉన్నారు. ఆయనకు అధికారంలో ఉన్నప్పుడు వైయస్ రాజశేఖరరెడ్డే గుర్తు లేరు. 2014 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని చూసి 67 సీట్లు, 2019లో ఆయనను చూసి 151 సీట్లు, 2024 ఎన్నికలలో కేవలం 11 సీట్లు కూడా జగన్‌మోహన్ రెడ్డిని చూసి ఓట్లు, సీట్లు ఇచ్చారని ఆయనకు బాగా తెలుసు. జగన్ మోహన్ రెడ్డి వైకాపా అనే లిమిటెడ్ కంపెనీని స్థాపించారు. ఇందులో ఆయన విశ్వాస పాత్రులు అయిన వారిని డైరెక్టర్లుగా నియమించుకున్నారు.. లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు ప్రెస్‌మీట్ పెట్టి యజమాని మాటగా చెబుతారు. లిమిటెడ్ కంపెనీలో ఉన్న మిగిలిన డైరెక్టర్లు, ఉద్యోగులు తల ఉపుతూ ఉండాలి. జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు చేస్తూ చిరిగిపోయిన చొక్కా, అరిగిపోయిన చెప్పులు కాళ్లకు వేసుకొని రోడ్లు ఎక్కి తిరుగుతూ జైలుకు వెళ్లినా, జగన్‌మోహన్ రెడ్డి వెళ్లి డిజిపిని కలవరు. పైస్థాయిలో కేంద్ర ప్రభుత్వానికి అప్పీల్ చేయరు. మీ చావు మీరు చావండి అంటూ వైకాపా లీగల్ సెల్ ఒకదాన్ని వేసి మీడియా ముందుకు వచ్చి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ప్రకటన చేస్తారు. ఆ వైకాపా లీగల్ ఎప్పుడు ఎక్కడ పనిచేస్తుందో బాధితులకు తెలియదు. బాధితులు మాత్రం తమకు తెలిసిన వారందర్నీ సాయం చేయండి అని అడుగుతున్నారు. నేను, నాది, నేనే అనే గర్వం వదిలిపెట్టి మనం, మనది, మన అందరం అనే కలుపుగోలుతనం ఉంటే తప్ప ప్రస్తుతం రాజకీయాలు నడవవు. పార్టీ అనేది ఒక వ్యవస్థ. పార్టీ అనేది ఒక కుటుంబం. కుటుంబంలో సమస్యలుంటే అందరినీ కూర్చోబెట్టి మాట్లాడే ఓపిక లేకపోతే మీరు ఎలాగూ వ్యాపారాలు చేస్తారు కాబట్టి వెళ్లి వ్యాపారం చేసుకుంటే పిచ్చి అమాయకులు అయిన కార్యకర్తలు నోరుమూసుకొని ఎవరి పనులు వాళ్లే చూసుకుంటారు. వ్యాపారాలు కావాలా? రాజకీయాలు కావాలా? డిసైడ్ చేసుకుంటే మంచిది.

• ఎడిటోరియల్

## అమెరికాకు పాకిన అవినీతి కథ

అచిర కాలంలోనే అపర కుబేరుడైన గౌతమ్ అదానీ వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక భారీ సంక్షోభం చుట్టుముట్టింది. అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్)లు సివిల్ సెక్యూరిటీల మోసంపై మోపబడిన అభియోగాలపై చేసిన విచారణలో సోలార్ కాంట్రాక్ట్‌ల కోసం ప్రభుత్వ అధికారులకు రూ.2,200 కోట్లకు పైగా చెల్లించినట్టు తేలింది. ఇరవై ఏళ్లలో రూ.15 వేల కోట్ల పన్ను అనంతర లాభాలను ఆర్జిస్తుందని అంచనా వేయబడిన రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టులను పొందేందుకు ఈ పథకం ఉద్దేశించబడిందని ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ నేరారోపణలో భారత ప్రభుత్వ అధికారులకు రూ.2,200 కోట్లకు పైగా లంచాలు చెల్లించడం, పెట్టుబడిదారులకు, బ్యాంకులకు అబద్ధాలు చెప్పి అనేక బిలియన్ల డాలర్లను సమీకరించడం, న్యాయాన్ని అడ్డుకోవడం వంటి ఆరోపణలున్నాయని డిప్యూటీ అసిస్టెంట్ అటార్నీ జనరల్ లిసా మిల్లర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదానీ గ్రూప్‌నకు చెందిన గ్రీన్ ఎనర్జీ కంపెనీ అమెరికన్ స్టాక్ మార్కెట్లలో లిస్టు అయిన మారిషస్‌కు చెందిన అజూర్ పవర్ అనే కంపెనీతో భాగస్వామిగా ఉంది. భారతదేశంలో సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులను నిర్మించాలనే ప్రణాళికతో అమెరికన్ పెట్టుబడిదారులను పెద్ద ఎత్తున ఆకర్షించి, వారి నుంచి రూ.25వేల కోట్లు సేకరించింది. అయితే, సోలార్ విద్యుత్తు ఖరీదైనది కావటంతో ఏ ప్రభుత్వమూ దానిని కొనుగోలు చేయడానికి ఇష్టపడలేదు. దానితో భారతదేశంలో సౌరశక్తి ఒప్పందాలను పొందడంలో సమస్యలు తలెత్తాయి. ఆ సమస్యను పరిష్కరించడానికి భారతదేశంలో రాజకీయ నాయకులకు, బ్యూరోక్రాట్లకు రూ.2,200 కోట్లు లంచంగా ఇచ్చారు. ఈ నగదు అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి సేకరించిన నిధుల నుంచి వచ్చింది. ఇక్కడే అసలు కథ మొదలైంది. కార్పొరేట్ రంగంలో కుంభకోణాలను అరికట్టేందుకు 1977లో ఫారిన్ కరప్ట్ ప్రాక్టిసెస్ యాక్ట్ (ఎఫ్‌సిపిఏ) పేరిట అమెరికా ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం అమెరికా పెట్టుబడిదారుల ప్రమేయం ఉన్న, అమెరికా స్టాక్ ఎక్స్చేంజీలలో నమోదైన విదేశీ కంపెనీలు లంచం ఇవ్వటం, ఇస్తామని ఆశ చూపటం, ప్రభుత్వాధినేతలకు, అధికారులకు లంచం ఇవ్వటం నేరం. సోలార్ విద్యుత్తు కోసం నిధులను సేకరించిన అదానీ గ్రీన్ ఎనర్జీ, న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో నమోదైన అజూర్ పవర్ సహజంగానే ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ కేసును అమెరికా ప్రభుత్వ నేరపరిశోధక సంస్థ ఎఫ్‌బిఐ, మార్కెట్ రెగ్యులేటర్ సెక్ దర్యాప్తు చేసినప్పుడు భారతదేశంలో లంచాలు ఇచ్చినట్టు, అమెరికన్ పెట్టుబడిదారులను మోసం చేసినట్టు తేలింది. దానితో అమెరికన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్‌కి చెందిన గ్రాండ్ జ్యూరీ గౌతమ్ అదానీకి, మరో ఏడుగురికి వ్యతిరేకంగా అభియోగాలను దాఖలు చేసి, వారెంట్‌ను జారీ చేసింది. రెండేళ్లుగా కొనసాగుతున్న ఈ దర్యాప్తులో అదానీ భారతదేశ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీని తప్పుదారి పట్టించారని కూడా వెల్లడైంది. ఈ కుంభకోణంలో భాగం ఇచ్చిన లంచంలో సింహభాగం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రికి చేరినట్టు అమెరికన్ ప్రభుత్వ సంస్థల విచారణలో వెల్లడైంది. గౌతమ్ అదానీ జగన్‌ను స్వయంగా రెండు, మూడు సార్లు కలవడం జరిగిందని, అలా కలిసిన తర్వాత రూ.1750 కోట్లు లంచంగా ఇవ్వటానికి అంగీకారం కుదిరాకే ఒప్పందాలు ఖరారయ్యాయని అదానీ గ్రూపు కంపెనీల అంతర్గత సందేశాలలో వివరణలు ఉన్నట్టు విచారణలో తేలింది. 2023 ప్రారంభంలో వెలువడిన హిండెన్‌బర్గ్ పరిశోధన నివేదిక కంటే తాజా సంక్షోభం ప్రభావం తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు కెన్యా దేశం అదానీతో చేసుకున్న వ్యాపార ఒప్పందాలన్నీ రద్దు చేసుకుంది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున, అదానీ గ్రూపుపై మోపబడిన నేరారోపణలకు మోడీ ప్రభుత్వం సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. అదానీ గ్రూపు యాజమాన్యంలో ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్, సిమెంట్‌తో సహా అనేక రంగాలు ఉన్నాయి. ఈ పరిశ్రమలకు సంబంధించిన నియంత్రణాధికారులందరూ ఇప్పుడు లేవనెత్తిన ఆరోపణలను పారదర్శకంగా, ఒక నిర్ణీత సమయంలో పరిశోధించాల్సిన అవసరం ఉంది. భారతీయ మార్కెట్లను అణగదొక్కడానికి ఇది ఒక 'అంతర్జాతీయ కుట్ర'లో భాగమని బీజేపీ ప్రతినిధి చేసిన వాదన ఎవ్వరినీ ఒప్పించజాలదు. ఇటువంటి వాదన భారత ప్రజల సాధారణ జ్ఞానాన్ని అవమానించడానికే పనికివస్తుంది. అత్యంత ప్రియతమ స్నేహితుడి లంచావతారంపై మోడీ తప్పించుకోవడం ఇప్పుడు సాధ్యం కాదు. అదానీని వెంటనే అరెస్టు చేయకపోతే, ఆ అవినీతిలో ప్రభుత్వమూ భాగస్వామి అయినట్లే.




మహారాష్ట్ర ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించినవారు ఒకరు భూపేంద్రయాదవైతే.. ఇంకొంకరు అశ్వనీ వైష్ణవ్. వీరిద్దరూ కేంద్ర మంత్రులు. మహారాష్ట్ర భారీ విజయంలో వీరిద్దరే వాస్తుశిల్పులు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా వీరి సేవలకు ఇప్పటికే కృతజ్ఞతలు ప్రకటించారు. వీరిద్దరూ ఇంఛార్జ్, కో- ఇంఛార్జులుగా వ్యహరించారు. 2024లో ఎన్డీఏ కూటమి విజయం సాధించిన వెంటనే బీజేపీ అధిష్ఠానం వీరిద్దరినీ మహారాష్ట్ర ఎన్నికలకు ఇంఛార్జులుగా నియమించింది. బీజేపీని మహారాష్ట్రలో అట్టడుగు స్థాయి వరకూ తీసుకెళ్లిన ఘనత వీరిద్దరిది. నవంబర్ పదోతేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మేనిఫెస్టో విడుదల చేసిన సమయంలోనూ వీరిద్దరూ వెళ్లి.. తెలియకుండా జనంలో కూర్చుని వారినుంచి ఎలాంటి స్పందన ఉందో గమనించారు.

## 'మహాయుతి' విజయంలో వారిద్దరే

# గేమ్ ఛేంజర్స్!

### సవాల్‌గా తీసుకున్న బీజేపీ!

గత 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మహారాష్ట్రలోని 38 లోక్ సభ స్థానాలకుగాను బీజేపీ కేవలం 9 స్థానాల్లో మాత్రమే గెల్చుకుంది. ఇది హిందుత్వ సెంటిమెంట్ అధికంగా కల్గిన మహారాష్ట్రలో బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బ. మరోవైపు తన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ 13 స్థానాలను గెల్చుకున్న అతి పెద్ద పార్టీగా నిల్చింది. అది అప్పటికే అధికారంలో ఉన్న మహాయుతిని కలవరపెట్టింది. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో అనుసరించిన వ్యూహాలపై బీజేపీ గట్టిగా ఫోకస్ చేసింది. గత ఏడాది మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లోనూ బీజేపీని విజయపథంలో నడిపించడంలోనూ భూపేంద్ర యాదవ్, అశ్వనీ వైష్ణవ్ లదే కీలకపాత్ర. మధ్యప్రదేశ్ ఎన్నికల తర్వాత ఈ ఇంఛార్జులపై పూర్తి విశ్వాసముంచిన బీజేపీ అధిష్ఠానం మహారాష్ట్రలోనూ వీరికే వ్యూహరచన బాధ్య తలప్పగించింది.

### భూపేందర్ యాదవ్, అశ్విని వైష్ణవ్ ఎవరు?

వీరిద్దరూ కేంద్ర మంత్రులు. భూపేంద్ర యాదవ్ అమిత్ షాకు సన్నిహితుడు. రాజస్థానీ బీజేపీ నాయకుడైన భూపేంద్రకు.. సొంత రాష్ట్రం రాజస్థాన్ తో పాటు, ఉత్తరప్రదేశ్, బీహార్‌తో సహా, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లోనూ మంచి పట్టుంది. భూపేంద్ర రాజస్థాన్‌లో 2013 ఎన్నికలకు, జార్ఖండ్ లో 2014 ఎన్నికలకు కో-ఇంఛార్జ్‌గా వ్యవహరించడంతో పాటు గుజరాత్‌కు అప్పటికే ఇంఛార్జ్‌గా ఉన్నారు. అలాగే గత 2019 లోక్ సభ ఎన్నికలతో పాటు, 2020 బీహార్ శాసనసభ ఎన్నికల్లోనూ ఇంఛార్జ్‌గా వ్యవహరించారు. అయితే, మహారాష్ట్ర వంటి రాష్ట్రంలో ఇంఛార్జ్ గా వ్యవహరించి పార్టీని విజయం వైపు నడిపించడం మాత్రం ఇదే తొలిసారి. భూపేంద్ర యాదవ్ ప్రస్తుతం పర్యావరణ, అటవీశాఖ కేంద్ర మంతిగా ఉన్నారు. 2012 నుంచి రాజ్యసభసభ్యుడిగా కొనసాగుతున్న భూపేంద్ర.. ప్రస్తుతం అల్వార్ లోక్ సభ నియోజక వర్గం నుంచి పార్లమెంట్ సభ్యుడు.

ఇక అశ్వనీ వైష్ణవ్ ది ప్రత్యేక శైలి. ప్రస్తుతం రైల్వే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మినిష్టర్‌గా ఉన్నారు. కాన్పూర్ ఐఐటీయన్‌గా టెక్నాలజీలో మాస్టర్స్ చేసిన అశ్విని వైష్ణవ్.. అమెరికాలోని ఫిలడేల్ఫియాలో వార్టన్ విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏలో పట్టా పొందారు.

సమాచార సాంకేతికత అనేది బలహీన వర్గాల జీవనశైలిని మార్చి వారిని స్థితిమంతులుగా నిలబెట్టాలన్న లక్ష్యం, ఉద్దేశంతో అశ్విన్ వైష్ణవ్ ఆలోచనలుంటాయి. భారత ప్రభుత్వ వెబ్ సైట్ లో చదివినప్పుడు అట్టడుగు వర్గాల జీవన స్థితిగతులను మార్చే విధంగా ప్రభుత్వ విధానాలుండాలని బలంగా విశ్వసించే వ్యక్తిగా అశ్వనీ వైష్ణవ్ కనిపిస్తారు.

అయితే, అశ్వనీ వైష్ణవ్, భూపేంద్ర యాదవ్ ఈ ఇద్దరూ మహారాష్ట్రలో బీజేపీ విజయ ప్రస్థానంలో కీలక పాత్రధారులైనప్పటికీ.. ఎక్కువ హడావిడి లేకుండా మీడియాకు దూరంగానే తమ వ్యూహాలను రచిస్తూ.. బ్యాక్ బెంచ్‌బాయ్స్‌గా ఉంటూ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని నడిపించారు. ముఖ్యంగా మహారాష్ట్రలో బీజేపీ అలయెన్స్ మహాయుతి విజయానికి లాడ్లీ బెహన్ యోజన పథకం ఓ గేమ్ ఛేంజర్ గా మారింది. పద్దెనిమిదేళ్లు నిండిన ఆడపిల్లలకు ఇప్పటికే ప్రతీ నెలా 15 వందల రూపాయలిస్తుండగా.. ఈసారి ఎన్నికల్లో గెలిస్తే రెండు వేల 1 వంద రూపాయలిస్తామని ప్రకటించడం ఇక్కడ మహాయుతికి బాగా కలిసివచ్చిందనే టాక్ ఉంది. ఎన్నికల ప్రచార సమయం నుంచే ఈ విషయం ప్రజల్లో బలంగా చర్చ జరగడం కూడా బీజేపీ విజయానికి కలిసిరాగా ఈ యోజన పథకం రూపశిల్పుల్లో కూడా వీరిద్దరి పాత్ర ఉండటంతో ఈ బ్యాక్ బెంచ్ బాయిస్ ఇద్దరూ ఇప్పుడు వార్తల్లో వ్యక్తులయ్యారు.

అయితే, మహారాష్ట్రలో బీజేపీ విజయంలో ఈ ఇద్దరు బ్యాక్ బెంచ్ బాయిస్ అయిన అశ్వనీ వైష్ణవ్, భూపేంద్ర యాదవ్ పేర్లు ఇప్పుడెలాగైతే పతాకశీర్షికలకెక్కుతున్నాయో జార్ఖండ్‌లో బొక్కాబోర్లా పడి ఎదురుదెబ్బ తగిలిన బీజేపి అపజయంలో మధ్యప్రదేశ్ ఇంఛార్జులుగా వ్యవహరించిన మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్.. అలాగే, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వశర్మల పేర్లు కూడా ఇప్పుడు వార్తల్లో హైలెట్‌గా నిలుస్తున్నయి. జార్ఖండ్ ఫలితాలు బీజేపీకే కాకుండా ఇంఛార్జులుగా వ్యవహరించిన వీరిద్దరికీ షాక్ ఇవ్వడంతో మహారాష్ట్ర, జార్ఖండ్ ఇంఛార్జుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

**- రమణ కొంటికర్ల**




‘హీరో’ సినిమాతో కథానాయకుడిగా పరిచయం అయ్యాడు మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా. ఆ చిత్రం నిరాశ పరిచింది. అతను కొంచెం గ్యాప్ తీసుకుని ఇప్పుడు ‘దేవకీ నందన వాసుదేవ’తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ‘హనుమాన్’ దర్శకుడు ప్రశాంత్ వర్మ అందించిన కథతో అర్జున్ జంధ్యాల రూపొందించిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

# బోయపాటి సినిమాకు ప్రశాంత్‌వర్మ టచ్!

**కథ:** కంసరాజు (దేవ్ దత్త నాగె) పరమ దుర్మార్గుడు. తన ఊరిలో తన కళ్లు పడ్డ భూములను సొంతం చేసుకుంటూ.. ఎదురు వచ్చిన వాళ్లందరినీ అడ్డు తొలగించుకుంటూ ముందుకు సాగుతుంటాడు. అతడికి తన చెల్లి చెల్లికి పుట్టే మూడో సంతానం ద్వారా ప్రాణ గండం ఉందని కాశీలో ఒక అఘోరా చెప్పిన మాటతో ఆమెను ఒక సంతానానికి పరిమితం చేసి తన భర్తను చంపేస్తాడు. ఐతే అంతలో ఓ హత్య కేసులో చిక్కుకుని అతను జైలు పాలవుతాడు. తిరిగి వచ్చేసరికి కంసరాజు మేనకోడలు సత్య (మానస వారణాసి) పెరిగి పెద్దవుతుంది. ఆ అమ్మాయిని కృష్ణ (అశోక్ గల్లా) ప్రేమిస్తాడు. ఆమె కూడా అతణ్ని ప్రేమిస్తుంది కానీ.. ఒక్కోసారి ఒక్కోలా ప్రవర్తిస్తూ అతణ్ని అయోమయంలోకి నెడుతుంది. అప్పుడే సత్య పుట్టుకకు సంబంధించి ఒక ఆశ్చర్యకర విషయం తెలుస్తుంది. ఆ విషయం ఏంటి.. ఇంతకీ కంసరాజు ప్రాణ గండం సంగతి ఏమైంది.. ఈ విషయాలు తెర మీదే తెలుసుకోవాలి.

**నటీనటులు:** అశోక్ గల్లా ‘హీరో’ తర్వాత చాలా టైం తీసుకుని ఈ సినిమా చేశాడు. కానీ తన తొలి సినిమానే దీని కంటే అన్ని రకాలుగా బెటర్ అనిపిస్తుంది. కొంచెం చలాకీగా నటించే ప్రయత్నం చేశాడు కానీ.. బేసిగ్గా తన పాత్రలో హుషారు పుట్టించేలా లేదు. ఆరంభంలో ఆ పాత్రకు ఇచ్చిన బిల్డప్‌కి.. తర్వాత అది నడిచే తీరుకు పొంతన లేదు. కథ హీరో చుట్టూ తిరిగేది కూడా కాకపోవడంతో ఆ పాత్ర అనుకున్నంతగా హైలైట్ కాలేదు. అశోక్ నటన పర్వాలేదు. కథానాయిక మానస వారణాసికి కీలకమైన పాత్రే దక్కింది కానీ.. ఆమె అంతగా ఆకట్టుకోలేకపోయింది. తన అప్పీయరెన్స్.. నటన మామూలుగా అనిపిస్తాయి. విలన్ పాత్రలో దేవ్ దత్త నాగె పర్వాలేదు. దేవయాని.. ఝాన్సీ బాగానే చేశారు. శత్రును కామెడీ కోసం వాడుకున్నారు కానీ.. అతను నవ్వించలేక పోయాడు. గెటప్ శీనుది నామమాత్రమైన పాత్ర. సంజయ్ స్వరూప్ కూడా అంతే.

**సాంకేతిక వర్గం:** పిండి కొద్దీ రొట్టె అన్నట్లు ‘దేవకీ నందన వాసుదేవ’ టెక్నికల్ గా కూడా ఏమంత గొప్పగా లేదు. భీమ్స్ సిసిరోలియో పాటలు.. నేపథ్య సంగీతం.. మామూలుగా సాగిపోయాయి. రసూల్ ఎల్లోర్-ప్రసాద్ మూరెళ్ల లాంటి అనుభవజ్ఞులైన ఛాయాగ్రాహకులు పని చేశారు కానీ.. విజువల్స్ లో మెరుపులేమీ లేవు. నిర్మాణ విలువలు ఓకే. హనుమాన్ దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ అంటే చాలా ఊహించుకుంటాం కానీ.. ఇందులో అంత విశేషమేమీ లేదు. ఈ కథకు సరైన కథనం జోడించి ఉంటే మెరుగుపడేదేమో కానీ.. అలాంటి ప్రయత్నమేమీ జరగలేదు. దర్శకుడిగా అర్జున్ జంధ్యాల పూర్తిగా నిరాశపరిచాడు.

### కథనం-విశ్లేషణ:

కార్తికేయ-2.. కాంతార.. హనుమాన్ లాంటి సినిమాలు విజయవంతం అయ్యాక.. వాటిని అనుకరించే సినిమాలు ఎక్కువైపోయాయి. చారిత్రక నేపథ్యం తీసుకోవడం.. దేవుడి ఎలిమెంట్ పెట్టడం.. రొటీన్ గా కథను నడిపించేసి మమ అనిపించడం.. ఇదీ వరస. ‘దేవకీ నందన వాసుదేవ’ అచ్చంగా అలాంటి ప్రయత్నమే. భాగవతం రెఫరెన్స్ తీసుకుని ‘హనుమాన్’ దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ పరంగా ఏదో ట్రై చేశాడు కానీ.. దానికి పేలవమైన స్క్రీన్ ప్లే తోడవడం.. నరేషన్ మరీ ఓల్డ్ స్టయిల్లో ఉండడంతో ‘దేవకీ నందన వాసుదేవ’ ఏమాత్రం వర్కవుట్ కాలేదు. రెండు గంటల తక్కువ నిడివి సినిమా అయినా.. ఎప్పుడు ముగుస్తుందా అని ప్రేక్షకులు నిరీక్షించేలా చేసే నీరసమైన నరేషన్ ఈ చిత్రానికి పెద్ద మైనస్. కథానాయిక పాత్రకు సంబంధించి ఇందులో చూపించిన ఓ ఎలిమెంట్ ఎగ్జైటింగ్ గా అనిపించినా.. దాన్ని తెరపై ప్రెజెంట్ చేసిన తీరు నిట్టూర్పులనే మిగులుస్తుంది.

పైన చెప్పుకున్న కార్తికేయ-2.. కాంతార.. హనుమాన్ లాంటి చిత్రాల్లో కేవలం దేవుడి ఎలిమెంట్ ఉండడం వల్ల అవి ఆడేయలేదు. ఆ ఎలిమెంట్ ను ఎంత ఆసక్తికరంగా చూపించారన్నదే వాటి ఫలితాలను నిర్దేశించింది. కేవలం పదే పదే దేవుడిని చూపించి.. బ్యాగ్రౌండ్లో మంత్రాలు పఠించేసి.. దేవుడు-విధి-జననం-మరణం-మృత్యువు అంటూ భారమైన డైలాగులు పెట్టేసినంత మాత్రాన ప్రేక్షకులు ఉద్వేగంతో ఊగిపోరనడానికి ‘దేవకీ నందన వాసుదేవ’ రుజువు. సినిమా ఆరంభమైన తీరే ఇదొక రొటీన్ సినిమా అనే సంకేతాలను ఇస్తుంది. విలన్ పాత్రను ప్రెజెంట్ చేసిన విధానం.. అతడి బ్యాక్ స్టోరీ సినిమా మీద ఆసక్తిని చంపేస్తుంది. ఆ తర్వాత రొటీన్ ఎలివేషన్.. పరిచయ సన్నివేశంతో మొదలయ్యే హీరో పాత్ర కూడా ఆసక్తిని పెంచదు. హీరోయిన్ పాత్ర చాలాసేపు సాధారణంగా అనిపిస్తుంది. తర్వాత ఆ పాత్రకు సంబంధించి ట్విస్ట్ ఇచ్చి కొంత ఆసక్తి రేకెత్తించినా.. తర్వాత షరా మామూలే.

హీరో హీరోయిన్ల ప్రేమకథ కానీ.. విలన్ పునఃప్రవేశంతో మొదలయ్యే డ్రామా కానీ ప్రేక్షకుల్లో మినిమం ఇంట్రెస్ట్ క్రియేట్ చేయవు. హీరోయిన్.. ఆమె తల్లి పడ్డ కష్టాలను చూపించి కొంచెం ఎమోషన్ పిండడానికి ప్రయత్నించగా.. అదీ వర్కవుట్ కాలేదు. ఆ సన్నివేశాల్లో మెలోడ్రామా బాగా ఎక్కువైపోయింది. అక్కడక్కడా సాయిమాధవ్ డైలాగుల్లో కొన్ని మెరుపులు కనిపిస్తాయి తప్ప.. ఆ సంభాషణల్లో ఉన్న లోతుకు తగ్గట్లు సన్నివేశాలు ఉండవు. పదే పదే కాశీలో అఘోరాను చూపించి విపరీతమైన ఆవేశంతో ఏవో డైలాగులు చెప్పించారు కానీ.. అదంతా అతిగా అనిపిస్తుంది. అంతకంతకూ ఆసక్తి సన్నగిల్లిపోయేలా సాగే కథ.. ఏ దశలోనూ ఊపందుకోని కథనం.. చాలా బోరింగ్ గా నడిచే సన్నివేశాలు.. ‘దేవకీ నందన వాసుదేవ’ను సహనానికి పరీక్షలా మారుస్తాయి. కొంచెం తక్కువ నిడివితో తెరకెక్కడం మినహాయిస్తే ఇందులో చెప్పుకోదగ్గ సానుకూలతలు ఏమీ లేవు.



- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## రుద్రాక్షలతో దర్శనమిచ్చిన శ్రీ ఉమా రుద్ర కోటేశ్వర స్వామి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన బలరాము క్షేత్రంలో శ్రీఉమా రుద్ర కోటేశ్వరస్వామి రుద్రాక్షుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆఖరి సోమవారం రోజున రుద్రాక్షలతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు ఉమారుద్రుడు దర్శన భాగ్యం కలిగింది. లక్షకు పైగా రుద్రాక్షలతో కనిపించిన శ్రీ ఉమారుద్రకోటేశ్వరస్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఆరవల్లి శ్రీరామ్మూర్తి శర్మ వేకువజామున విశేష అర్చనలు, హారతులు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో ఏడాదిలో ఒకమారు మాత్రమే రుద్రాక్షలతో శ్రీఉమారుద్రకోటేశ్వర స్వామి దర్శనము ఉంటుందని, భక్తులు దేవాలయానికి విచ్చేసి స్వామి దర్శనం చేసుకోవడం ద్వారా పునీతులు అవుతారన్నారు. ఈఓ కే.సర్వేశ్వరరావు భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## కోతకు గురైన కళింగపట్నం బీచ్

(సత్యంన్యూస్, గార)

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంశధార నది నుండి వచ్చిన వరద వల్ల పోర్ట్ కళింగపట్నం వద్ద ఉన్న బీచ్ మొత్తం 500ల మీటర్ల వరకు కోతకు గురై అక్కడ ఉన్న పర్యాటక విభాగం ఏర్పాటు చేసిన విగ్రహాలు మొత్తం సముద్రంలో కొట్టుకుపోయాయి. కళింగపట్నం గ్రామస్తులు విన్నపం మేరకు జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వేగులాడ దుర్గారావు ప్రదేశాన్ని సందర్శించారు. నది సముద్రంలో కలిసే ముఖద్వారం దగ్గర ఉన్న ఎడమ వైపు పాయలని కొంతమంది రొయ్యల వ్యాపారస్తులుగా చెరువులుగా మార్చి నదీగర్భాన్ని మూసివేయడం వలనే సముద్రం కోతకు గురైందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకొని వెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొండ ఉదయ్ శంకర్, గుంటూ పంచాయితీ పెద్దలు బుద్ద ఎర్రన్న, రవి, రాజులు పాల్గొన్నారు.



## స్ఫూర్తి కోసం రాజ్యాంగ దినోత్సవం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

రాజ్యాంగ దినోత్సవం నిర్వహించడం ద్వారా స్ఫూర్తిని పొందుతామని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.శ్యామసుందర్ చెప్పారు. సోమవారం ఉదయం కళాశాల ఆవరణలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈనెల 26వ తేదీన జరుగుతున్న రాజ్యాంగ దినోత్సవాన్ని రాజకీయాలకతీతంగా అందరూ నిర్వహించాలని కోరారు. డాక్టర్ అంబేద్కర్ ఎంతో ముందు చూపుతో ప్రజలకు హక్కులను కల్పిస్తూ రాజ్యాంగం రచించారని, వాటికి వివిధ రూపాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని వేదిక జిల్లా కన్వీనర్ మోహనరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక గౌరవ సలహాదారు నల్లి ధర్మారావు, ఎన్.ఈశ్వరరావు, జి ధనంజయరావు, జి.తిరుపతిరావు, పి.సందీప్ కుమార్, కె.రాజారావు, జె.రవిబాబు, బి.పుష్పలత, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు

(సత్యంన్యూస్, రణస్థలం)

కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా బంటుపల్లి పంచాయతీలో వెలిసిన ఎండల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కుటుంబసమేతంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండల మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజల అభిమానంతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నామన్నారు. ప్రజల సంతోషజీవితానికి అవసరమైన మెరుగైన చర్యల కోసం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.



## రాబిన్ హుడ్ ఆర్మీ సేవలు విస్తృతం కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాబిన్ హుడ్ ఆర్మీ సేవలు విస్తృతం కావాలని శ్రీకాకుళం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సోమవారం అన్నారు. స్థానిక వైష్ణవు వీధికి చెందిన ఎలమిల్లి పద్మ కుమార్తె లిఖిత చిన్ననాటి నుండి పోలియో లక్షణాలతో నడవలేని పరిస్థితి, తండ్రి కూడా కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందగా, ఇళ్లల్లో పని చేసుకుంటూ కుటుంబాన్ని, నడవలేని కుమార్తెకు అండగా నిలుస్తుంది. కుమార్తె పెద్దదవుతున్న కొలది కుటుంబానికి భారమవుతోంది. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం రాబిన్‌హుడ్ ఆర్మీ సంస్థ సభ్యుడు నంది ఉమాశంకర్, విశాఖపట్టణం రాబిన్‌హుడ్ ఆర్మీ సంస్థ సభ్యులతో మాట్లాడి, వారందించిన సహకారంతో శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు చేతుల మీదుగా సోమవారం అందించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన ఎలమిల్లి లిఖితకు అండగా నిలవటం హర్షణీయమని, రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థ అధ్యక్షురాలు మాడుగుల రేణుక, హరికృష్ణతోపాటు ఇతర సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే జిల్లాలో ఎవరికైన చక్రాల కుర్చీ అవసరమనుకుంటే సంప్రదించవచ్చున్నారు. పూర్తి వివరాలకు 9701698408 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ ఏవో అనంతపల్లి నర్సింగరావు, మేనేజర్ బి.సతీష్, బ్లడ్‌బ్యాంకు మేనేజర్ అయేషా బేగం, ప్రతినిధులు హర్ష, పవన్ కుమార్, జీవితకాల సభ్యులు చిన్మయరావులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా శ్రీనివాసరావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాజ్యాంగ దినోత్సవంను పురస్కరించుకుని రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ అవార్డుకి మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దపాడు సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు మక్కా శ్రీనివాసరావు ఎంపికయ్యారు. విజయనగరంలో ఆంధ్రప్రదేశ్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం నిర్వహించిన సాంఘిక శాస్త్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ప్రాంతీయ విద్యా సంచాలకులు విజయభాస్కర్ ,ఫోరమ్ నాయకుల చేతుల మీదుగా శ్రీనివాసరావుకి అవార్డు ప్రధానం చేశారు. రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌గా, డాట్ పరీక్షా పత్రాల రూపకల్పన చేసే బృందంలో సభ్యుడిగా శ్రీనివాసరావు జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు విశిష్ట సేవలందిస్తున్నారు. వినూత్న బోధనా పద్ధతుకు సాంకేతికత జోడించి విద్యార్థులను ఆకట్టుకునే విధంగా జిల్లాలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా కోశాధికారిగా గత ఏడాది రాష్ట్రంలోనే తొలిసారిగా సాంఘిక సదస్సును ఘనంగా నిర్వహించడంలో ముఖ్య భూమిక పోషించిన వారిలో శ్రీనివాసరావు ఒకరు కావడం గమనార్హం.



# మహిళలపై హింసకు పాల్పడితే చర్యలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహిళలుపై హింసకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయం నుండి సంతోషిమాత గుడి వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ కలసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్త్రీ హింస నిరోధక కార్యక్రమాలు నెలరోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంపై మహిళల్లో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ, డీఆర్డీయే శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు సంబంధించి న్యాయ కేంద్రాలు ఉన్నాయని, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుండి జిజిహెచ్‌లో వన్‌స్టాప్ సెంటర్ ఉందని మహిళలకు సంబంధించి కుటుంబ సమస్యలు ఉంటే న్యాయ సహాయం కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒన్ స్టాప్ సెంటర్లు మహిళలు కోసం ప్రతీ చోటా ఉన్నట్లు చెప్పారు. ఇవే కాకుండా కౌన్సిలర్లను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కౌన్సిలింగ్ తర్వాత కోర్టులకు వెళ్లి లీగల్ ప్రొసీజర్ ఫాలవ్వడం ఉంటాయన్నారు. మండలాల వారీగా, సిడిపిఓ వారీగ మహిళలకు న్యాయ సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో కౌన్సిలర్లు ఉంటారన్నారు. ఈ ర్యాలీ ద్వారా వైద్య ఆరోగ్య, మహిళా స్త్రీ శిశు సంక్షేమం, డీఆర్డీయేలతోపాటు సచివాలయ సిబ్బంది మహిళల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కడైనా మహిళలపై గృహహింస లేదా పని చేసే స్థలాల్లో హింస జరిగితే స్థానిక, ఇంటర్ డిపార్ట్మెంట్, కలెక్టరేట్‌లలో కమిటీలు ఉంటాయని, ఎక్కడైనా మహిళలపై వేధింపులు జరిగినట్లు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ర్యాలీలో బాల్య వివాహ రహత భారతదేశం, జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం, తదితర స్లోగన్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ జిల్లా అధికారి అనూరాధ, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డీఆర్డీయే పీడీ కిరణ్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, డీఆర్డీయే సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# సేవా దృక్పథం కలిగిన వారికే గుర్తింపు

(సత్యంన్యూస్, పొందూరు)

సమాజానికి ఉత్తమ సేవలందించే వారికి ఎల్లప్పుడు సముచిత గౌరవం లభిస్తుందని లయన్స్ అంతర్జాతీయ నిధి సమన్వయకర్త, విశ్రాంత ఎం.పి.డి.వో కుప్పిలి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత తహశీల్దార్ బలివాడ గోవిందరావు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాలవలస దివాకర్ పాత్రో, వాండ్రంగి ఉమాశంకర్ దుశ్శాలువలు కప్పి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు, కుప్పిలి రవికుమార్, వి.దామోదరరావు, ఎం.సత్యన్నారాయణ, బెహరా విజయకుమార్, వి.భాస్కరరావు, వి.నిరంజన్, వాండ్రంగి సుధాకరరావు, బలివాడ వెంకటేశ్వర్లు,ఉరిటి సతీష్, బలివాడ శివ, ప్రముఖ డిజైనర్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.



## పలువురికి పిసిని సత్కారం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నేతలతోపాటు ఇటీవలే పీఏసీ చైర్మన్‌గా నియమితులైన పులిపర్తి నానిని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీకేఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ సోమవారం సత్కరించారు. ఈమేరకు ముందుగా పీఏసీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజనేయులును, ప్రభుత్వ విప్‌గా నియమితులైన తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను, భీమవరానికి చెందిన పీఏసీ సభ్యులు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూర్యనారాయణరాజును వారి వారి స్వగృహాల్లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన బొబ్బిలి నియోజకవర్గ ఇంచార్జ్, గిరడా అప్పలస్వామినాయుడు, సత్యవాడ నవీన్ కుమార్, స్థానిక సీనియర్ నాయకులు శ్రీనివాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో 3రోజుల పాటు జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ 66వ వార్షిక సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శాఖ కు రెండు అవార్డులు వరించాయి. ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డు డాక్టర్ ఎస్.నరసింహ మూర్తికి, మిషన్ పింక్ ఆక్టివిటీ అవార్డు ఐఎంఎ శ్రీకాకుళం విమెన్ డాక్టర్స్ వింగ్‌కు దక్కాయి. ఈ అవార్డులను డాక్టర్ నరసింహ మూర్తి డాక్టర్ గంగాధర్ అందుకున్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**



# సమాజమే ధ్యేయంగా రచనలు సాగించాలి



(సత్యంన్యూస్, రాజాం)

సమాజమే ధ్యేయంగా రచనలు సాగించాలని ప్రముఖ నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు కోరారు. ఆదివారం స్థానిక విద్యా నికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 118 వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ మజ్జి భారతి రచించిన 'వేకువ' కథాసంపుటాన్ని మజ్జి చంద్రినాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అట్టాడ అప్పలనాయుడు కీలకోపన్యాసం అందించారు. సమాజంలో ధనికులు, అధికారులు, నాయకులు, పోలీసులు లాంటి ఆధిపత్య వర్గాల వారు క్రిందివర్గాల ప్రజల్ని అనేక రకాలుగా ఇబ్బంది పెడుతూ ఉంటారని, అలాంటి బాధితుల పక్షాన నిలిచి కవులు, రచయితలు రచనలు కొనసాగించాలన్నారు. ఈ నేలమీది మూలవాసుల్ని, ఆదివాసుల్ని తరిమి ఆయా ప్రాంతాలను ఆధిపత్య వర్గాల వారు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, దాని పర్యవసానమే అడవుల్లో ప్రస్తుతం జరుగుతున్న పోరాటమని వివరించారు. ఇలాంటి సామాజిక సమస్యలను ఎత్తిచూపే రచనలు రావాలని అట్టాడ అప్పలనాయుడు కోరారు. ఈ సందర్భంగా రచయిత్రి మజ్జి భారతిని వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. వేదిక నిర్వాహకుడు గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కథా రచయిత గంటేడ గౌరునాయుడు, పొట్నూరు కోటిబాబు, డా. హర శ్రీరాములు, నేతేటి గణేశ్వరరావు, గార సూర్యశైలజ, పిల్లా తిరుపతిరావు, ఒమ్మి రమణమూర్తి, డా.ఆల్తి మోహనరావు, పొదిలాపు శ్రీనివాసరావు, పడాల కవీశ్వరరావు, నేతేటి విజయశైలజ, పెంకి దయానిధి నాయుడు, సమతం మహేశ్వరరావు, కొత్త సాయి ప్రశాంత్‌కుమార్, గర్భాన సుమతి, కుదమ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానంతో ఏదో తెలియని ఆత్మ సంతృప్తి కలుగుతుందని లైన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులు, వి.వన్ రెస్టారెంట్ అధినేత టెక్కం రామ్‌గోపాల్ అన్నారు. నగరంలో పలు ముఖ్య కూడలితోపాటు, పాత బస్‌స్టాండ్, ఏడురోడ్ల కూడలి, సూర్యమహల్, రామలక్ష్మణ కూడలి, నైట్ షెల్టర్ తదితర ప్రాంతాలలో ఆదివారం అల్పాహార వితరణ కార్యక్రమం చేపట్టారు. నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కొన్ని సంస్థల సభ్యులు సోమవారం చింతాడ కృష్ణ సిఐ.ఎస్ఎఫ్ జవాన్ జన్మదినం సందర్భంగా మదర్స్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా అతిధిగా పాల్గొన్న లైన్ టెక్కం రామ్‌గోపాల్ అల్పాహారం అందించి మాట్లాడుతూ జై జవాన్, జై కిసాన్ అని, దేశానికి రెండు కళ్ళు వంటి వారని, జవాన్‌గా దేశం కోసం విధులు నిర్వర్తిస్తూ ఇక్కడ ఈ రోజు సేవలో బాగమవ్వటం హర్షణీయమన్నారు. నిరుపేదలకు ఆహారాన్ని అందించటం ఒక వరమని, అలాంటిది గత నాలుగు సంవత్సరాలుగా వీరు వారానికి ఒక సారి అన్నదానం చెయ్యటం మంచి విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్లం శివతేజ, డా.పైడి ప్రదీప్, నంది ఉమాశంకర్, పొడుగు చరణ్, జాడసాయి తదితరులు పాల్గొన్నారు.



ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

